క్లుప్తంగా

ఎంపీ మోపిదేవి వినాయక చవితి శుభాకాంక్షలు

రేపల్లె రూరల్: ఆదిపూజలు అందుకుని, విఘ్నాలు తొలగించే విఘ్నేశ్వరుని కరుణను ప్రతి ఒక్కరూ పొందాలని ఎంపీ మోపిదేవి ఆదివారం ఒక ప్రకటనలో కోరారు. సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించే విధంగా ప్రతి ఒక్కరూ ఆనందదాయక వాతావరణంలో పండుగను జరుపుకోవాలని, ఆయన నియోజకవర్గ ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు.

వెల్లటూరులో విశ్వకర్మ జయంతి



వెల్లటూరు(భట్టిప్రోలు): వెల్లటూరులో ఆదివారం విశ్వకర్మ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని విశ్వబ్రాహ్మణులు విశ్వకర్మను పూలతో అభిషేకించారు. విశ్వకర్మ యోజన పథకం అమలు నేపథ్యంలో ప్రధాని మోదీకి ధన్యవాదాలు తెలిపారు. ప్రతి ఒక్కరూ విశ్వకర్మ యోజన సైట్‌లో నమోదు చేసుకుని, సర్టిఫికెట్లు, ఐడెంటీ కార్డు పొందాల్సిందిగా సూచించారు. మార్తి నాగేశ్వరరావు, కోడూరు వెంకటేశ్వరరావు, మార్తి నాగ సురేష్, క్రాప వెంకటాచారి, పామర్తి సుధీర్, క్రాప రవి కుమార్, నూతలపాటి రామకృష్ణ, లంక విజయభాస్కర శాస్త్రి, కిర్లంపల్లి రామబ్రహ్మం, కోడూరు కాశీ కుమార్ పాల్గొన్నారు.

23న భట్టిప్రోలు సర్వసభ్య సమావేశం

భట్టిప్రోలు: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వ సభ్య సమావేశం ఈ నెల 23న మధ్యాహ్నం 2:30 గంటలకు సమావేశ మందిరంలో ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి అధ్యక్షతన నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుమ్మా చంద్రశేఖరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు హాజరు కావాలని పేర్కొన్నారు.

28న చేతి వృత్తిదారుల సమాఖ్య సమావేశం



భట్టిప్రోలు: చేతి వృత్తి దారుల సమాఖ్య ఏపీ సమితి సమావేశం ఈ నెల 28న విజయవాడలో నిర్వహించనున్నట్లు సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షుడు జి. బాలాజి తెలిపారు. ఆదివారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో విలేకరులకు వివరాలు వెల్లడించారు. పాలకులు అనుసరిస్తున్న విధానాల వల్ల చేతి వృత్తిదారులు ఉపాధి కరువై పనుల కోసం వలసలు వెళుతున్నారని పేర్కొన్నారు. ఈ సమావేశంలో సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవి సత్యనారాయణ మూర్తి, సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. రామాంజనేయులు, సభ్యులు కె. అంకమరావు, వేమూరు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి బండారు శ్రీనివాసరావు, ఏఐటీయూసీ నాయకులు వి. శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పేదలకు దుస్తులు పంపిణీ

బాపట్ల: గ్రీన్ పీస్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భంగా పేదలకు దుస్తులను జెడ్పీటీసీ పిన్నిబోయిన ఎస్తేరురాణి ఆదివారం పంపిణీ చేశారు. ప్రతి ఏడాది వినాయక చవితి సందర్భంగా దుస్తులు పంపిణీ చేస్తున్నట్లు ఆర్గనైజేషన్ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు ఒ.నాగరాజు, సభ్యులు కె.నాగరాజు, ఎం.శ్రీను, వి.ప్రసాద్, లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

108 వాహనంలో ప్రసవం

చేబ్రోలు: 108 వాహనంలో గర్భిణి ప్రసవించిన ఘటన శనివారం రాత్రి చేబ్రోలు మండలంలో జరిగింది. మండలంలోని సుద్దపల్లికి చెందిన షేక్ రేష్మా పురిటి నొప్పులతో బాధపడుతుండటంతో కుటుంబ సభ్యులు 108 వాహనానికి సమాచారం అందించారు. వెంటనే స్పందించిన సిబ్బంది ఆమెను గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గం మధ్యలో పురిటి నొప్పులు అధికమయ్యాయి. బుడంపాడు గ్రామ సమీపంలో వాహనాన్ని పక్కన నిలిపి సిబ్బంది ఎండీ. ఖాన్, బి. యహోషావా అత్యవసర వైద్యసేవలు అందించారు. మహిళ రెండో కాన్పులో మగ శిశువుకు జన్మనిచ్చింది. ఇద్దరూ క్షేమంగా ఉన్నారు. అనంతరం వారిని వాహన సిబ్బంది గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

అసోసియేషన్ అధ్యక్షుడిగా కరిముల్లా

తెనాలిఅర్బన్: ఏపీ ఇరిగేషన్, ఆర్ అండ్ బీ, పీఆర్, ఆర్‌డబ్ల్యుయూవోఎస్ డిపార్ట్‌మెంట్స్ మెయింటెనెన్స్ అండ్ ప్రాజెక్టు ఎస్టాబ్లిష్‌మెంట్ అసోసియేసన్ తెనాలిశాఖ అధ్యక్షునిగా షేక్ కరిముల్లా, ఉపాధ్యక్షులుగా ఎం.శ్రీనివాసరావు, ఎం.చిన్నాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు. ఇరిగేషన్ కార్యాలయం సమీపంలో ఆదివారం కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ప్రధాన కార్యదర్శిగా షేక్ అజిబుల్లా, సంయుక్త కార్యదర్శులు కె.రంగారావు, కె.ప్రసన్న, పి.రాజశేఖర్‌లను ఎన్నుకున్నట్లు చెప్పారు. వీరికి సభ్యులు శుభాకాంక్షలు తెలియజేసి అభినందించారు.

పూజలందుకో.. విశ్వనాయకా..!

- వినాయక చవితి ఉత్సవాలకు ప్రజలు సిద్ధం
- వాడవాడలా గణేశుని విగ్రహాల ఏర్పాటు
- పత్రి విక్రయాలతో బాపట్లలో రద్దీ
- మండపాల్లో కొలువుదీరనున్న గణనాథుడు



బాపట్ల పట్టణంలో పూలు, పండ్లు కొనుగోలులో ప్రజలు..

బాపట్ల అర్బన్: సకల లోకాలకు ఆది పూజ్యుడైన వినాయకుడు వాడవాడలా ఠీవిగా కొలువుదీరారు. జై వినాయకా.. జైజై విశ్వనాయకా అంటూ గణనాథుడ్ని ఆరాధించేందుకు జిల్లా ప్రజలు సిద్ధమయ్యారు. ఆదివారం స్వామి వారికి ప్రీతిపాత్రమైన పత్రి, ఇతర పూజాసామగ్రి కొనుగోలుతో బాపట్ల పట్టణం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. గణనాథుడి పూజకు అవసరమైన పూజా ద్రవ్యాల సేకరణలో భక్తులు నిమగ్నమయ్యారు. వినాయక చవితి సందర్భంగా బాపట్ల జిల్లా కేంద్రంలో పండుగ వాతావరణం నెలకొంది. జిల్లా వ్యాప్తంగా వాడవాడలా గణనాథుడి మండపాలు ఏర్పాటు చేశారు. ఆ మండపాల్లో ఇప్పటికే వినాయకుడి విగ్రహాలను కొలువుదీర్చారు. భక్తిశ్రద్ధలతో స్వామి వారిని పూజించేందుకు సకల ఏర్పాట్లు చేసుకున్నారు.

పూజా సామగ్రికి డిమాండ్

వినాయకచవితి పర్వదినాన్ని పురస్కరించుకుని బాపట్ల పట్టణంలోని రథం బజార్ సెంటర్, మార్కెట్ సెంటర్, చీలు రోడ్డు, బస్టాండ్ ప్రాంతాల్లో గణేశుని పూజా సామగ్రి విక్రయాలు ప్రారంభించారు. పత్రికి అవసరమైన వెలగపండు, అరటి బోదెలు, పండ్లు వంటివి విక్రయిస్తున్నారు. ఈ ఏడాది పూజా సామగ్రి ధరలు అధికంగా ఉన్నాయని భక్తులు చెబుతున్నారు. గతంలోకంటే 50 శాతం ధరలు పెరిగాయని అంటున్నారు.

మట్టి విగ్రహాలకే అధిక ప్రాధాన్యం

బాపట్ల పట్టణంలోని వివిధ ప్రాంతాల్లో మట్టి విగ్రహాలు విక్రయిస్తున్నారు. సాక్షి మీడియా, రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల వినియోగం ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. ఈ నేపథ్యంలో విద్యార్థులు అధిక శాతం మట్టి విగ్రహాల కొనుగోలుకు ప్రాధాన్యమిస్తున్నారు. మట్టి విగ్రహాల ద్వారా పర్యావరణ కాలుష్యాన్ని కాపాడుకోవచ్చని అంటున్నారు.

■ **బాపట్లటౌన్:** మొదటి పూజ గణనాథుడికే. సోమవారం వినాయక చవితి ఉత్సవాలు నిర్వహించేందుకు జనాలు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. విఘ్నరాజానమః అంటూ వేడుకలు చేసేందుకు మండపాలు సిద్ధం చేశారు. బాపట్ల జిల్లాతో పాటు పల్నాడు, గుంటూరు, కృష్ణా జిల్లాల్లోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చే గణనాథుడి భారీ విగ్రహాల నిమజ్జనం నేపథ్యంలో జిల్లాలోని సూర్యలంక సముద్రతీరం, రామాపురం, నిజాంపట్నం, పాండురంగాపురం, ఓడరేవు తీర ప్రాంతాల్లో పోలీసులు పటిష్ట ఏర్పాట్లు చేశారు.



రేపల్లె: ఓల్డ్‌టౌన్ కన్యకా పరమేశ్వరి ఆలయ ఆవరణంలో భారీ విఘ్నేశ్వరుని విగ్రహం



రేపల్లెలో అమ్మకానికి సిద్ధంగా వినాయక విగ్రహాలు

■ **రేపల్లె రూరల్:** వినాయచ చవితి సందర్భంగా నవరాత్రులకు పట్టణంలోని వివిధ విఘ్నేశ్వర స్వామి దేవాలయాలు వేడుకలకు ముస్తాబయ్యాయి. మార్కెట్ సెంటరులోని విఘ్నేశ్వరుని ఆలయం, రంగా బొమ్మ సెంటరులోని విఘ్నేశ్వర స్వామి ఆలయానికి విద్యుత్‌దీపాలతో శోభాయమానంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని పెదకూరగాయల మార్కెట్, రాజ్యలక్ష్మి థియేటర్ సెంటర్, నెహ్రూబొమ్మ సెంటరులు కొనుగోలు దారులతో కళకళలాడాయి.



రేపల్లె పట్టణంలో వినాయక చవితి పత్రిని కొనుగోలు చేస్తున్న భక్తులు



రేపల్లెలో విద్యుత్‌దీపాల అలంకరణలో మెరిసిపోతున్న మండపం



గణనాథుడికి ప్రీతిపాత్రమైన కాయలు



మట్టి విగ్రహాన్ని కొనుగోలు చేస్తున్న యువతి



మట్టి విగ్రహాలను కొనుగోలు ..



చవితి పూజకు సిద్ధంగా పుష్పాలు



చెరుకుపల్లి: వినాయక విగ్రహాన్ని వాహనంలో తీసుకెళ్తున్న యువకులు

వైఎస్సార్ సీపీలో చేరిన టీడీపీ నేత



పిట్టలవానిపాలెం: మండలంలోని చందోలు గ్రామ మాజీ సర్పంచ్ కరీంబేగ్(సర్దార్)టీడీపీని వీడి వైఎస్సార్ సీపీలో చేరారు. బాపట్ల శాసన సభ్యుడు కోన రఘుపతి సమక్షంలో ఏపీ రహదారుల అభివృద్ధి కార్పొరేషన డైరెక్టర్ షేక్ అహ్మద్ హుస్సేన్, పార్టీ మండలాధ్యక్షుడు ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీ కండువా కప్పుకున్నారు. లీలా శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ రానున్న రోజుల్లో ఇతర పార్టీల నుంచి వైఎస్సార్ సీపీలోకి వలసలు అధికంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేశారు. 2024 ఎన్నికల్లో బాపట్లలో వైఎస్సార్ సీపీ జెండాను ఎగురవేసి, ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఎన్నుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైభవంగా మహా సుదర్శన హోమం



తెనాలిటౌన్: షరాఫ్‌బజార్‌లోని శ్రీసువర్చలా సమేత పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో పవిత్రోత్సవాలు, శ్రీ మహా సుదర్శన హోమం వైభవంగా నిర్వహిస్తున్నారు. ఆదివారం ఆలయంలో తిరుమలలో జరిగే విధంగా తిరుప్పావడ సేవను నిర్వహించారు. 108 కేజీల పులిహోరను రాశిగా పోసి పండ్లు, డ్రైఫ్రూట్స్, పిండి వంటలతో ఆంజనేయస్వామి రూపంలో అలంకరణ చేశారు. ఆగమోక్తంగా అర్చన, కైంకర్యాలను నిర్వహించి స్వామికి సమర్పించారు. తొలుత శ్రీ మహా సుదర్శన స్వామి విగ్రహానికి పంచామృత స్నపన, అర్చన, సుదర్శన హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైఖానస ఆగమోక్తంగా ఆలయ వంశపారంపర్య అర్చకులు ఆర్. శ్రీనివాసమూర్తి ఆధ్వర్యంలో జరిపారు. వైఖానాస ఆగమ పండితులు రఘురామ్, నాగ మారుతీలు, రుత్విక్‌లు వైదిక క్రతువును శాస్త్రోక్తంగా నిర్వహించారు. తిరుప్పావడ సేవ, సుదర్శన హోమాల విశిష్టతను పండితులు వివరించారు. భక్తులు విశేషంగా పాల్గొని స్వామివారిని దర్శించుకుని పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణాధికారి శ్రీనివాసారెడ్డి, అర్చకులు కిరణ్‌కుమార్, సురేష్, దాతలు గుడివాడ సత్యనారాయణ, సుబ్రమణ్యం, శివ ప్రసాద్, బాలకృష్ణ, రామారావు, సంకీర్తన బృందం అధ్యక్షురాలు అనురాధ, సభ్యులు పాల్గొన్నారు.

పేదల జీవితాల్లో వెలుగులు

- రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున
- భట్టిప్రోలులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



భట్టిప్రోలులో మహిళకు అభివాదం చేస్తున్న మంత్రి నాగార్జున

భట్టిప్రోలు: పేదల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశంలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను తీసుకు వచ్చారని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ మేరుగ నాగార్జున అన్నారు. భట్టిప్రోలులో ఆదివారం ఉదయం, సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. బాపట్ల అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటి చైర్మన్ దేవినేని మల్లికార్జునరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నాగార్జున గడప గడపకు వెళ్లి సంక్షేమ పథకాల ద్వారా ప్రజలు పొందిన లబ్ధిని వివరించారు. ప్రజా సమస్యలను అడిగి, తెలుసుకున్నారు. అక్కడికక్కడే అధికారులతో మాట్లాడి వాటి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా వైఎస్సార్ సీపీ నాయకులు గాలి అరవింద మంత్రి నాగార్జునకు హారతి పట్టి స్వాగతం పలికారు. తలకొల యలమంద మంత్రి సమక్షంలో అద్దేపల్లి గ్రామానికి చెందిన బడుగు వేణుగోపాల్‌ను పార్టీలో చేర్పించారు. నాగార్జున మాట్లాడుతూ సంక్షేమ పథకాలు అమలు చేయడం వైఎస్సార్ సీపీతోనే సాధ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ దారా రవికిరణ్మయి, ఎంపీపీ దావూరి వెంకట లలిత కుమారి, జెడ్పీటీసీ తిరువీధుల ఉదయ భాస్కరి, వైస్ ఎంపీపీ కొతరపు పిచ్చయ్యశాస్త్రి, పార్టీ మండల కన్వీనర్ మోర్ల శ్రీనివాసరావు(నాని), ఎంపీటీసీ డొక్కు నాగకుమారి, పట్టణ అధ్యక్షులు కుందేటి రమేష్, ఉప సర్పంచ్ బూర్లె రామప్రసాద్, మద్దుల గిరిధర్, నాయకులు వేల్పూరి బాలసుబ్రహ్మణ్య(చిన్నారి), పీజీ అరుణ్‌శాస్త్రి, వేల్పూరి నాగేశ్వరరావు, సయ్యద్ నబీ, జానీ, ఎంఏ రహమాన్, దారా చెన్నయ్య, దావూరి నాగమల్లేశ్వరరావు, తిరువీధుల బాలాజి, కొలుసు శ్రీనివాసరావు, అధికారులు పాల్గొన్నారు.

ఇతర రాష్ట్రాలకు ఆదర్శం ఏపీ సంక్షేమం

- ఎంపీ మోపిదేవి వెంకట రమణారావు
- బొర్రావారిపాలెంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'



కేసనవారిపాలెంలో మహిళలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ మోపిదేవి

నిజాంపట్నం: ఆంధ్రప్రదేశ్‌లో అమలవుతున్న సంక్షేమ పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా నిలిచాయని రాజ్యసభ సభ్యుడు మోపిదేవి వెంకట రమణారావు అన్నారు. బొర్రావారిపాలెం, కేసనవారిపాలెం, అచ్యుతాపురం గ్రామాల్లో ఆదివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందించడం జరుగుతోందన్నారు. ఒక్కో కుటుంబానికి లక్షల రూపాయల సంక్షేమ ఫలాలు అందాయని చెప్పారు. లబ్ధిపొందిన కుటుంబాలు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రుణం తీర్చుకునేందుకు సిద్ధంగా ఉన్నారని ఎంపీ చెప్పారు. అర్హత ఉండి ఏవైనా సాంకేతిక లోపాల కారణాలతో సంక్షేమ పథకాలు అందకపోతే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం నుంచి ఒక్కో కుటుంబానికి ఎంత లబ్ధిచేకూరిందనే విషయాలను మహిళలకు వివరించారు. ఆయా గ్రామాల్లో నెలకొన్న పలు సమస్యలను స్థానికులు ఎంపీ మోపిదేవి దృష్టికి తీసుకొచ్చారు. వెంటనే వాటిని పరిష్కరించాలని అధికారులను ఆయన ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ మోపిదేవి విజయనిర్మల, జెడ్పీటీసీ నర్రా సుబ్బయ్య, డీసీఎంఎస్ చైర్‌పర్సన్ యార్లగడ్డ భాగ్యలక్ష్మి మదన్, మాజీ జెడ్పీటీసీ ప్రసాదం వాసుదేవ, సర్పంచ్ కేసన ముత్యాలమ్మ, సోమయ్య, రఘురామయ్య, సుకన్య, శ్రీనివాసరావు, సోమేష్ తదితరులు పాల్గొన్నారు. అచ్యుతాపురం గ్రామానికి వచ్చిన ఎంపీ మోపిదేవికి కల్లుగీత కార్మికులు ఘన స్వాగతం పలికారు. గీత కార్మికులు మోకును కట్టి, పుష్పగుచ్ఛాలు ఇచ్చి స్వాగతం పలికారు. అదేవిధంగా గీత కార్మికులు వైఎస్సార్ సీపీ జెండాలతో తాడిచెట్టు ఎక్కి జెండా రెపరెపలాడేలా ఎగరవేశారు.

నెలాఖరు నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ కెజియా గ్రేస్



పాతమల్లాయపాలెంలో జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో భాగంగా చేస్తున్న వైద్య పరీక్షలు

ప్రత్తిపాడు: మండలంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు ఈ నెల 30 నుంచి ప్రారంభమై అక్టోబరు 30 వరకు జరగనున్నాయని గొట్టిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ కెజియా గ్రేస్ తెలిపారు. అందులో భాగంగా ఈనెల 30 న పాతమల్లాయపాలెంలో, అక్టోబరు 3న వంగిపురం, 5న కోయవారిపాలెం, 7 ప్రత్తిపాడు-బి, 10న తిక్కిరెడ్డిపాలెం, 12న ప్రత్తిపాడు-1, 17న ప్రత్తిపాడు-ఏ, 19న యనమదల, 21న నడింపాలెం-2, 26న గొట్టిపాడు, గనికపూడి, 27న చినకోండ్రుపాడు, నడింపాలెం, 30న తుమ్మలపాలెంలో శిబిరాలు జరగనున్నట్లు చెప్పారు. గొట్టిపాడు పీహెచ్‌సీ ఒక టీంగా, ప్రత్తిపాడు పీహెచ్‌సీ రెండవ టీంగా ఏర్పడి గ్రామాల్లో క్యాంపులు నిర్వహిస్తామని ఆయన తెలిపారు. ఆయా పీహెచ్‌సీల వైద్యాధికారులు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం క్యాంపుల్లో అందుబాటులో ఉండి రోగులకు వైద్యసేవలు అందిస్తారని చెప్పారు.

పాతమల్లాయపాలెంలో డోర్ టు డోర్ సర్వే

క్యాంపు జరిగే తేదీకి పదిహేను రోజుల ముందు నుంచి నిర్దేశిత గ్రామాల్లో ముందస్తుగా సర్వే నిర్వహిస్తామని కెజియాగ్రేస్ తెలిపారు. అందులో భాగంగా మండలంలో మొదటిగా పాతమల్లాయపాలెంలో ప్రారంభించామన్నారు. ఎంఎల్‌హెచ్‌పీలు, ఏఎన్‌ఎంలు, ఆశా కార్యకర్తలు ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే చేస్తున్నారని వివరించారు. కుటుంబంలోని సభ్యుల ఆరోగ్య వివరాలు, పరిస్థితిని తెలుసుకుని, సమస్యలుంటే ఏడు రకాల పరీక్షలు అక్కడికక్కడే నిర్వహిస్తారని చెప్పారు. అనంతరం వైద్యులు పరీక్షించి చికిత్స అందిస్తారని ఆమె తెలిపారు. సర్వేకు ప్రజలు సహకరించాలని కెజియాగ్రేస్ కోరారు. సిబ్బంది కూడా అలసత్వం లేకుండా సర్వే చేయాలని ఆదేశించారు.

దిండి తీరంలో వ్యర్థాల తొలగింపు



సముద్రతీరాన వ్యర్థాలను తొలగిస్తున్న శాస్త్రవేత్త వెంకటసాయి, అధికారులు

నిజాంపట్నం: తీర ప్రాంతాన్ని రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని ఇన్కయిస్ సంస్థ సైంటిస్ట్ డాక్టర్ గులకారం వెంకటసాయి అన్నారు. మండలంలోని దిండి సముద్రతీరంలో అంతర్జాతీయ తీర పరిశుభ్రత దినోత్సవంలో భాగంగా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం వ్యర్థాలను తొలగించారు. వ్యర్థాలను సంచుల్లో నింపి, వాహనాల్లో తీసుకువెళ్లారు. ఈ కార్యక్రమంలో మత్స్య, అటవీ, మెరైన్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు బ్యాగులు పంపిణీ

బాపట్ల: విద్యార్థులు చక్కగా చదువుకుని ఉన్నత స్థితికి చేరుకోవాలని ఎస్ టు సీడి ఫౌండేషన్ నిర్వాహకులు తోట సురేష్‌బాబు పేర్కొన్నారు. మండలంలోని అడవిపల్లి పాలెంలోని పాఠశాలలో విద్యార్థులకు అరుణ్ జ్యోతి బయో వెంచర్స్ దాతృత్వంతో ఉచితంగా బ్యాగులు పంపిణీ చేశారు. ఫౌండేషన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ప్రతి ఏడాది బ్యాగులు పంపిణీ చేస్తామని సురేష్‌బాబు తెలిపారు.

పురోగమిస్తున్న కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ

తెనాలి: పట్టణ కొత్తపేటలోని కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ 23వ వార్షిక సర్వసభ్య సమావేశం ఆదివారం ఎన్జీవో కళ్యాణమండపంలో నిర్వహించారు. సొసైటీ చైర్మన్ దావులూరి లక్ష్మీకాంతారావు అధ్యక్షత వహించారు. సొసైటీ డైరెక్టర్/ న్యాయవాది వెలినేని రాఘవయ్య, మోహన్ అండ్ కో చార్టర్డ్ అకౌంటెంట్స్ డి.రాజేష్, డైరెక్టర్లు, సభ్యులు పాల్గొన్నారు. చైర్మన్ తరఫున వార్షిక నివేదికను వైస్‌చైర్మన్ చంద్రమౌళి, వార్షిక లావాదేవీలను సీఈవో కె.ఝాన్సీ సమావేశంలో నివేదించారు. 2001లో దావులూరి సోమశేఖరరావు స్థాపించిన కాకతీయ కో-ఆపరేటివ్ సొసైటీ ప్రస్థానాన్ని ప్రస్తుత చైర్మన్ లక్ష్మీకాంతారావు వివరించారు. సంస్థ పాలకవర్గ డైరెక్టర్లు, సభ్యుల సహకారంతో సొసైటీ పురోగమిస్తోందని చెప్పారు. తొలుత తెనాలిలో హెడ్డాఫీసు, అంగలకుదురులో బ్రాంచితో ఏర్పాటైన సొసైటీ ప్రస్తుతం తొమ్మిది బ్రాంచిలుగా నడుస్తోందని గుర్తుచేశారు. అన్ని బ్రాంచిలు లాభాలబాటలో పయనిస్తున్నాయని తెలిపారు. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సొసైటీ రూ.2.50 కోట్ల నికర లాభాన్ని ఆర్జించిందని వివరించారు. తొలుత వ్యవస్థాపకుడు సోమశేఖరరావు చిత్రపటానికి నివాళులర్పించారు. అంతకుముందు శ్రీవెంకట లక్ష్మీదుర్గా నాట్యమండలి, తెనాలి వారిచే 'దేవనర్తకి' పద్యనాటకంలోని కొన్ని సన్నివేశాలను ప్రదర్శించారు. ఆరాధ్యుల కోటేశ్వరరావు, కడపకు చెందిన నటి రత్నశ్రీలు నటించారు.

అంగన్‌వాడీ సహాయకురాలి పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రత్తిపాడు: స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న సహాయకురాలి పోస్టుల్ని భర్తీ చేసేందుకు అర్హులైన మహిళల నుంచి దరఖాస్తుల్ని ఆహ్వానిస్తున్నట్లు సీడీపీవో వి. సుజాతాదేవి తెలిపారు. ప్రత్తిపాడు మండలంలోని నడింపాలెం ఎస్సీ కాలనీ అంగన్‌వాడీ కేంద్రం (బీసీ-బి), గనికపూడి డీడబ్ల్యూ కేంద్రం (ఎస్సీ), పెదనందిపాడు బీసీ-1 కేంద్రం (బీసీ-బి), వట్టిచెరుకూరు మండలంలోని ముట్లూరు వడ్డెరపాలెం కేంద్రం (బీసీ-బి)లో ఖాళీలున్నట్లు ఆమె పేర్కొన్నారు. దరఖాస్తుదారులు 2023 జులై ఒకటో తేదీ నాటికి 21 సంవత్సరాలు నిండి 35 సంవత్సరాల మధ్య వయస్సుతో పాటు స్థానిక నివాసులై, వివాహితై ఉండాలనని పేర్కొన్నారు. ఏడో తరగతి ఉత్తీర్ణత సాధించాలన్నారు. అర్హులైన వారు ఈ నెల 25వ తేదీ సాయంత్రం ఐదు గంటల్లోపు ప్రత్తిపాడులోని ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.